సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024




కంచే.. చేను మేసే..
కంచే చేను మేసినట్టుగా అటవీ సంపదతో పాటు అభివృద్ధి నిధులను ఆ శాఖ ఉద్యోగులే కాజేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో



భారీగా గంజాయి పట్టివేత
భద్రాచలంలో ఐదు కేసుల్లో 319 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
31° / 25°
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

డీసీసీ డీలా !



రాష్ట్రంలో అధికార మార్పిడి తర్వాత జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల్లో ఎవరికీ కేబినెట్ హోదా దక్కలేదు. అయితే భద్రాచలం నుంచి పోటీ చేసి ఓడిపోయిన పొదెం వీరయ్యను మాత్రం అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హోదాతో రాష్ట్ర స్థాయిలో ప్రొటోకాల్ పదవి గత జూలై 8న వరించింది. దీంతో జిల్లా అభివృద్ధిపై ఆయన దృష్టి సారిస్తారనే అందరూ భావించారు. అయితే గత రెండు నెలలుగా ఈ దిశగా పొదెం వీరయ్య ఎలాంటి చొరవ చూపించిన దాఖలాలు లేవు. మరోవైపు డీసీసీ అధ్యక్షుడి హోదాలో పార్టీని బలోపేతం చేయడం, పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించడంపైనా ఆసక్తి చూపించడం లేదనే అభిప్రాయం కార్యకర్తల్లో రోజురోజుకూ బలపడుతోంది.

– సాక్షి ప్రతినిధి భద్రాద్రి కొత్తగూడెం

- కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలపై మక్కువ చూపని జిల్లా అధ్యక్షుడు
- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ హోదాలో పొదెం
- జిల్లా అటవీ అభివృద్ధిపై నా దృష్టి సారించని వైనం

వీరయ్యా.. ఇదేం తీరయ్యా అంటున్న శ్రేణులు

ఎకో టూరిజం అభివృద్ధికి..
రాష్ట్రంలోనే అత్యధిక అడవులు ఈ జిల్లాలో విస్తరించి ఉన్నాయి. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ప్రత్యేక పాలసీ తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన కూడా చేశారు. అయితే జిల్లా నుంచి అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న పొదెం వీరయ్య మాత్రం ఈ అంశంపై కనీస స్థాయిలో చొరవ చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత నెలలో కిన్నెరసాని దగ్గర ఎకో టూరిజం అభివృద్ధికి గల అవకాశాలు పరిశీలించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంలోనూ, ఆ తర్వాత కాలంలో దీనిపై పొదెం నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. పెదవాగు కొట్టుకుపోయినప్పుడు, గోదావరి వరదలు, భారీ వర్షాలతో మణుగూరు మునిగిపోయిన సందర్భాల్లోనూ పొదెం ఇటు జిల్లాలో, అటు సొంత నియోజకవర్గమైన భద్రాచలంలో కనిపించలేదు. రాష్ట్ర స్థాయి ప్రొటోకాల్ పదవి దక్కిన తర్వాత ఇటీవల భద్రాచలంలో జరిగిన స్వాగత సన్మాన సభలోనే ఆయన కనిపించడం గమనార్హం.

‘భద్రాద్రి’లో వీరయ్య ప్రస్థానం ఇలా..
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగుకు చెందిన పొదెం వీరయ్య 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఈ సమయంలో కాంగ్రెస్ తరఫున గెలిచిన జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ గూటికి చేరినా పొదెం వీరయ్య ఒక్కరే కాంగ్రెస్‌లో కొనసాగారు. దీంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఆ పార్టీ కట్టబెట్టింది. మొదటి టర్మ్‌లో డీసీసీ అధ్యక్షుడిగా తనదైన మార్క్ చూపించడంలో పొదెం విఫలమయ్యారు. ముఖ్యంగా అశ్వారావుపేట, ఇల్లెందు నియోజకవర్గాల్లో వర్గపోరును కట్టడి చేయలేకపోయారు. అయినప్పటికీ 2023లో రెండోసారి డీసీసీ పగ్గాలను హస్తం పార్టీ అధిష్టానం ఆయనకే అప్పగించింది. 2023 నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో భద్రాచలం నుంచి పోటీ చేసిన పొదెం వీరయ్య అనూహ్యంగా ఓటమి చవిచూశారు. మిగిలిన నాలుగు స్థానాలు కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడ్డాయి. అయినప్పటికీ పొదెం సేవలను గుర్తించిన అధిష్టానం అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి ప్రొటోకాల్ గల పదవిని కట్టబెట్టింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇటు పార్టీ, అటు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వీరయ్యకు వచ్చినా ఆయన అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది.

ప్రేక్షక పాత్రేనా..
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి ‘నంబర్ వన్ టెర్రరిస్ట్’ అంటూ కేంద్రమంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టు చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే బిట్టు వ్యాఖ్యలను ఖండిస్తూ డీసీసీ అధ్యక్షుడి నుంచి కనీస ప్రకటన వెలువడలేదు. సీతారామ ప్రాజెక్ట్ పంపుల ప్రారంభం సందర్భంగా ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన విమర్శలకు జిల్లా కాంగ్రెస్ నుంచి ఎదురుదాడి లేకుండా పోయింది. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై వరుసగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని గులాబీ శ్రేణులు నిర్ణయించగా దానికి కౌంటర్ ఎటాక్ కాంగ్రెస్ నుంచి కనిపించడం లేదు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలన్నీ ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు కేబినెట్ మంత్రుల కేంద్రంగానే కొనసాగుతున్నాయని, డీసీసీ కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమైందనే విమర్శలు వస్తున్నాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

28న జాతీయ లోక్ అదాలత్



కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో ఈనెల 28వ తేదీ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా కేసులు ఉంటే రాజీ చేసుకోవచ్చని సూచించారు. యాక్సిడెంట్, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్, భూ తగాదాలు, వివాహ బంధం, దొంగతనాలు, ట్రాఫిక్ చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ తగాదాలు, బ్యాంకు, టెలిఫోన్, సైబర్ క్రైమ్ తదితర కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేసుకుని అవకాశం ఉందని వివరించారు. కక్షిదారులు కోర్టు చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేసుకోవద్దనే ఉద్దేశంతోనే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ కేసులు త్వరగా పరిష్కరించుకునేందుకు ఇది మంచి వేదిక అని పేర్కొన్నారు.

డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: రహదారులపై వాహనాల రద్దీ నేపథ్యాన ప్రమాదాల సంఖ్య కూడా పెరిగిందని.. ఈక్రమంలో ఆర్టీసీ బస్ డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ సూచించారు. రీజియన్ పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదాలు, బస్సులు దెబ్బతినడానికి కారకులైన డ్రైవర్లకు ఖమ్మంలో మంగళవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లోకెల్లా టీజీఎస్ ఆర్టీసీలో మాత్రమే అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంస్థపై నమ్మకంతో ఉండే ప్రయాణికులే కాక డ్రైవర్ల కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల సంఖ్య మరింత తగ్గించేలా సురక్షితమైన విధానాలు అవలంబించాలని సూచించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్) ఎస్.భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకాన్ని నిషేధించాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

కొత్తగూడెంరూరల్: అనారోగ్యం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పొగాకు వినియోగాన్ని నిషేధించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎల్.భాస్కర్ తెలిపారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి, 60 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు వారి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాలలో ప్రజలకు పొగాకు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని, పొగాకు సంబంధించిన ఉత్పత్తులు ఖైనీ, జర్దా, గుట్కా, సిగరెట్, బీడీ, చుట్ట, పాన్ మసాల వినియోగించడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు బాలాజీ, మధువరుణ్, స్వప్న, కల్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- నిత్యం పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పోలీస్ సిబ్బందికి ఎస్పీ ఆదేశం



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంరూరల్ : వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులను ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం ఆయన లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు కేసులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. అదే సమయంలో స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలేంటని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరగకుండా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నేర విచారణలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రమణారెడ్డి ఉన్నారు.

ఎంఈఓలుగా సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలు



భద్రాచలం ఎంఈఓగా నియమితులైన టి.రమ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో మండల నోడల్ అధికారులుగా పని చేస్తున్న వారిని, సీనియర్ గెజిటెడ్ హెడ్ మాస్టర్లను పూర్తిస్థాయి ఎంఈఓ(ఎఫ్ఏసీ)లుగా నియమించారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం అందరూ ఇన్‌చార్జ్ ఎంఈఓలే ఉండడం, వారు కూడా మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు చూస్తుండడంతో పర్యవేక్షణ కరువవుతోంది. దీంతో అన్ని మండలాలకు గ్రేడ్–2 సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలను ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జ్) ఎంఈఓలుగా నియమించారు.

హెచ్‌ఎం పేరు	కేటాయించిన మండలం	హెచ్‌ఎం పేరు	కేటాయించిన మండలం
భద్రాచలం	టి.రమ	గుండాల	కె.పార్వతమ్మ
కొత్తగూడెం	ప్రభుదయాళ్	అశ్వారావుపేట	పి.ప్రసాద్‌రావు
ములకలపల్లి	జి.సత్యనారాయణ	అశ్వాపురం	వి.వీరస్వామి
ఆళ్లపల్లి	కె.శాంతారావు	అన్నపురెడ్డిపల్లి	యు.ఆనందకుమార్
దుమ్ముగూడెం	జి. సమ్మయ్య	లక్ష్మీదేవిపల్లి	పి.కృష్ణయ్య
దమ్మపేట	కె.లక్ష్మి	సుజాతనగర్	ఎల్.లీల
పినపాక	కె.నాగయ్య	ఇల్లెందు	టీవీఆర్‌ఎన్ స్వామి
చండ్రుగొండ	ఎం.సత్యనారాయణ	బూర్గంపాడు	ఎం.యదుసింహరాజు
జూలూరుపాడు	బి.జుంకీలాల్	చర్ల	పీ.వీ.రమణ
టేకులపల్లి	ఎ.జగన్	మణుగూరు	జి.స్వర్ణజ్యోతి
చుంచుపల్లి	బి.బాలాజీ	కరకగూడెం	జి.మంజుల
పాల్వంచ	ఎ.శ్రీరాంమూర్తి		

రేపు జాబ్‌మేళా

చుంచుపల్లి: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసేందుకు ఈ నెల 26న చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 50 ఖాళీల భర్తీకి ఎస్సెస్సీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన 18–45 ఏళ్ల అభ్యర్థులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 9491681612 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

30న రోల్ ప్లే పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 30న రోల్ ప్లే పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో జరిగే పోటీలకు ఆయా పాఠశాలల్లో 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఒక టీం(నలుగురు లేదా ఐదుగురు విద్యార్థులు) పాల్గొనాలని, వీరంతా స్కూల్ యూనిఫాంలోనే ఉండాలని సూచించారు. వేదికపై ఎలాంటి వస్తువులు వినియోగించవద్దని, సంభాషణ ఇంగ్లిష్‌లోనే ఉండాలని తెలిపారు. ప్రతీ టీమ్‌కు ఐదు నుంచి ఆరు నిమిషాల సమయం ఉంటుందని, జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన టీమ్‌లోని ఒక్కో విద్యార్థికి రూ.300, ద్వితీయ బహుమతి పొందిన టీమ్ విద్యార్థులకు రూ.200, తృతీయ బహుమతి రూ.150 చొప్పున ఇస్తామని వివరించారు. ప్రథమ బహుమతి సాధించిన టీమ్‌ను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థుల వివరాలు ఈనెల 28లోగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్‌కు అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

‘ప్రశస్త’ యాప్‌పై నేటి నుంచి శిక్షణ
దివ్యాంగ పిల్లలను స్క్రీనింగ్ పరీక్ష ద్వారా గుర్తించేందుకు రూపొందించిన ప్రశస్త యాప్‌పై బుధవారం నుంచి ఈనెల 27 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల నుంచి 5,713 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 2,612 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నారని వివరించారు. ఈ మేరకు అన్ని మండలాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మా ఊళ్లో మద్యం అమ్మొద్దు..

- అమ్మితే రూ.50 వేల జరిమానా..
- పెద్దల సమక్షంలో మహిళల తీర్మానం
- అధికారులకు ప్రతుల అందజేత



తహసీల్దార్‌కు తీర్మానప్రతి అందజేస్తున్న మహిళలు

కరకగూడెం: మద్యంతో జరిగే అనర్థాలను గుర్తించిన మహిళలు తమ గ్రామాల్లో అమ్మొద్దంటూ ఆందోళన బాట పట్టారు. కరకగూడెం మండలం చిరుమళ్ల, వట్టంవారి గుంపు గ్రామాలకు చెందిన పలువురు మహిళలు.. ఈ మేరకు మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో వట్టంవారిగుంపులో మద్య నిషేధంపై తీర్మానం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు ఉన్నాయని, మద్యం, గుడుంబా అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసైన వారు ఇంట్లో కుటుంబసభ్యులను ఇబ్బంది పెడుతున్నారని, ఇటీవల కొందరు అనారోగ్యం బారిన పడడంతో పాటు ఆర్థికంగా చితికిపోతున్నారని వాపోయారు. తమ గ్రామాల్లో ఎవరైనా తీర్మానాన్ని అతిక్రమించి మద్యం అమ్మితే రూ.50 వేలు జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ నాగప్రసాద్, ఎస్సై రాజేందర్‌తో పాటు ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులకు తీర్మాన ప్రతులను అందజేశారు.

అమెరికా అమ్మాయి.. ఇల్లెందు అబ్బాయి..



రామాలయంలో కిషోర్ – శోష్ణ దంపతులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ భోగ నందకిషోర్ –విజయ దంపతుల కుమారుడు రాహుల్ కిషోర్ కు అమెరికా దేశంలోని బోస్టన్ సిటీకి చెందిన శోష్ణతో ఇటీవల అక్కడే వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కాగా, పరస్పరం ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబాలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఉద్యోగాలకు కొన్ని రోజులు సెలవు పెట్టి ఇల్లెందుకు వచ్చిన ఆ దంపతులు స్థానిక నంబర్–2 బస్తీలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నూతన జంటను అభినందించారు.

గీతన్నకు రక్షణగా..

- గీత కార్మికులకు కాటమయ్య రక్షా కిట్లు
- జిల్లాలో 180 మందికి పంపిణీ చేయాలని లక్ష్యం
- ఇప్పటి వరకు 65 మంది బీసీ గీత కార్మికుల గుర్తింపు
- బీసీ సంక్షేమ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో శిక్షణ



కిట్ వినియోగంపై గీతకార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

పాల్వంచరూరల్: గీత కార్మికుల ప్రాణాలకు రక్షణగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. గీత కార్మికులు కల్లు సేకరణకు ఆయా సీజన్లలో రోజుకు నాలుగు సార్లు తాటిచెట్లు ఎక్కుతుంటారు. అయితే ఒక్కోసారి మోకు, ముస్తాదు తెగిపోవడం, జారడం వంటి ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు అంత ఎత్తు నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోతుంటారు. మరి కొందరు అంగవైకల్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలో వారికి రక్షణ కల్పించేలా సేఫ్టీ మోకులు(కిట్లు) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కత్తిమీద సామే..
కులవృత్తిపై ఆధారపడిన గీత కార్మికులు నేటికీ మోకు, ముస్తాదుతోనే తాటిచెట్లు ఎక్కుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఇలా చెట్టు ఎక్కి కల్లు గీయడం వారికి కత్తిమీద సామే అవుతోంది. చెట్లు వర్షానికి తడిసి జారుతుండడంతో ప్రమాదాలు జరుగుతుండగా వారిని కాపాడేందుకు రక్షణ కిట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని జిల్లాలోని 185 మంది గీత కార్మికులకు ఉచితంగా పంపిణీ చేయాలని బీసీ సంక్షేమాధికారులు నిర్ణయించగా.. ఇప్పటివరకు 65 మందిని గుర్తించారు. కాగా, కిట్ల వినియోగంపై వారికి ఇప్పటికే బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ అధికారులు శిక్షణ ఇస్తున్నారు.

బీసీ గీతకార్మికుల కొరత..
ఏజెన్సీ ప్రాంతమైన జిల్లాలో బీసీ గీత కార్మికుల కొరత అధికారులకు తలనొప్పిగా మారింది. జిల్లాలో ఎక్కువ శాతం మంది గిరిజనులే గీత కార్మికులుగా పనిచేస్తున్నారు. దీంతో బీసీ గీత కార్మికుల కోసం సంక్షేమ శాఖ అధికారులు ఊరూరు తిరిగి జల్లెడ పడుతున్నారు. ఇప్పటివరకు గుర్తించిన 65 మంది జాబితాను ఎక్సైజ్ శాఖ అధికారులు బీసీ సంక్షేమ శాఖకు అప్పగించారు. జిల్లాకు 185 కిట్లు మంజూరు కాగా, మిగిలిన 125 మంది కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కిట్ ప్రత్యేకతలివే..
ప్రభుత్వం గీతకార్మికుల రక్షణ కోసం అందిస్తున్న కాటమయ్య కిట్లు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. మోకు, ముస్తాదుతో తయారుచేసిన ప్రత్యేక తాడు చెట్టు ఎక్కిన కార్మికుడికి రక్షణగా గట్టిగా పట్టుకుని ఉంటుంది. దీంతో కార్మికుడు తాటిచెట్టు ఎక్కే సమయంలో కాలు జారినా, గుండెపోటుకు గురైనా కిందపడకుండా చెట్టుపైనే సురక్షితంగా లాక్ చేసి కాపాడుతుంది. రూ.15 వేల విలువైన ఈ కిట్ 300 కిలోల బరువును మోసేలా తయారుచేశారు.



ప్రభుత్వం గీతకార్మికులకు అందించే కాటమయ్య రక్షా కిట్

ఇప్పటికే శిక్షణ పూర్తి



గీత కార్మికులను తాటిచెట్టు ప్రమాదాల నుంచి సురక్షితంగా కాపాడేందుకు వీలుగా ప్రభుత్వం కాటమయ్య రక్ష కిట్లను అందజేస్తోంది. ఈ కిట్ల పంపిణీకి ఎక్సైజ్ శాఖ ద్వారా 65 మంది కార్మికుల జాబితా తీసుకున్నాం. వీటి వినియోగంపై ఇప్పటికే కొందరికి అవగాహన కల్పించాం. మరో 125 మందిని గుర్తించే పనిలో ఉన్నాం. ఈ నెలాఖరు కల్లా కిట్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఇందిర, జిల్లా బీసీ సంక్షేమాధికారి

ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నాం



ఎత్తయిన తాటి చెట్టును ఎక్కడం దిగడం ఎవరి వల్లా కాదు. కేవలం గీత వృత్తిదారులకే సాధ్యమవుతుంది. ఎన్ని ప్రమాదాలు జరిగినా భయపడకుండా ఉదయం, సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు సేకరిస్తుంటాం. మేం ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్ష కిట్లను ఇంకా జిల్లాలో పంపిణీ చేయలేదు. ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నాం.

– కె.కనకరాజు, గీతకార్మికుడు

సురక్షితంగా చెట్టు ఎక్కొచ్చు



ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్ష కిట్ తాటిచెట్టు ఎక్కితే ప్రమాదాలకు గురికాకుండా ఉండేలా రూపొందించారు. దీని ద్వారా సురక్షితంగా చెట్టు ఎక్కే అవకాశం ఉంది. ఇకపై ధైర్యంగా కుల వృత్తిని కొనసాగించవచ్చు.

– సీహెచ్.పాపారావు, నాగారం

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

పాల్వంచ: ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్ –7 అథ్లెటిక్స్‌లో పాల్వంచ నవభారత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. షాట్‌పుట్ అండర్ – 14 విభాగంలో బి.దియా రజత పతకం, అండర్– 19 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో టి.జ్ఞానవి బంగారు పతకం సాధించారు. జ్ఞానవి స్కేటింగ్ పోటీల్లోనూ ప్రతిభ చాటి పతకం సాధించింది. అక్టోబర్ 6 నుంచి వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. కాగా, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీఎస్.రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీదేవి, కోచ్ పవన్ కల్యాణ్ మంగళవారం వారిని అభినందించారు.

ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీలో ఇద్దరికి చోటు

జూలూరుపాడు: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీలో జూలూరుపాడు మండలానికి చెందిన రజక సంఘం నాయకులకు చోటు దక్కింది. ఈ నెల 26న హైదరాబాద్ రవీంద్రభారతిలో వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి జరగనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీని నియమించింది. ఈ కమిటీ కన్వీనర్లుగా పాపకొల్లు గ్రామానికి చెందిన రజక సంఘం నాయకుడు ధర్మరాజుల వెంకటనారాయణ, జూలూరుపాడుకు చెందిన రజక సంఘం నాయకుడు ముదిగొండ కోటేశ్వరరావును నియమించారు. వారి నియామకంపై పలువురు రజక సంఘం పెద్దలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



పూర్వ ఎంఈఓను విచారిస్తున్న ఆర్జేడీ

దమ్మపేట: మండల విద్యాశాఖలో గతంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై వరంగల్ విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి మంగళవారం విచారణ జరిపారు. అప్పటి ఎంఈఓ వనమా వెంకటేశ్వరరావు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు రాగా, ఆర్జేడీ ఆయనను మండల విద్యా వనరుల కేంద్రంలో విచారించారు. అనంతరం దమ్మపేటలోని అర్బన్ కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. మూడో తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు



పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని చెబుతున్న వినియోగదారులు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్‌లో నీళ్లు కలిసి రావడంతో వినియోగదారులు యాజమాన్యాన్ని నిలదీశారు. మంగళవారం అశ్వారావుపేటకు చెందిన ఓ వ్యక్తి రెండ్రోజులుగా పెట్రోల్ నింపుకోగా అడుగున రెండంగుళాల మేర నీళ్లు ఉన్నాయి. బంక్‌లోనే నీటిని బాటిల్‌కు నింపి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఇంతలో అక్కడ జనం గుమిగూడి యజమానిని నిలదీయడంతో పెట్రోల్‌లో నీళ్లు చేరుతుంటాయని.. సిబ్బంది గమనించకపోవచ్చని సర్దిచెప్పి పంపారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

చంద్రుగొండ: మండల కేంద్రం శివారు అయన్నపాలెం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ చాపలమడుగు వెంకటేశ్వర్లు మంగళవారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. చంద్రుగొండలో డ్రెయిన్ పనులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. రావిచెట్టు ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ కనెక్షన్లు నిలిపివేసే క్రమంలో వెంకటేశ్వర్లు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న ఆయనను ప్రాథమిక చికిత్స అనంతరం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పాల్వంచ: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ఎస్ఐ రాఘవయ్య ఆధ్వర్యంలో దమ్మపేట రోడ్‌లో దాడి చేసి నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. నలుగురు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కంచే.. చేను మేసే..

- పర్యవేక్షణ లోపం.. విధులు అపహాస్యం
- అభివృద్ధి మాటున అంతరిస్తున్న అడవులు
- ఏటేటా చెరిగిపోతున్న అడవుల సరిహద్దులు
- నష్టం జరిగాక చర్యలతో కనిపించని ఫలితం
- ఇదీ అటవీశాఖలో జరుగుతున్న తంతు



సరిహద్దులు తేలక నేటికీ వివాదాస్పదంగా ఉన్న పూసపల్లి భూములు

ఇల్లెందురూరల్: అడవులలో సహజ సిద్ధంగా ఉద్భవించిన వెలకట్టలేనంత సంపదను రక్షించడానికి అటవీశాఖ పనిచేస్తోంది. ఈ సంపదను రక్షించి.. మరింత వృద్ధి చేసి.. భావితరాలకు అందించే ప్రక్రియను అటవీశాఖలో పనిచేసే ఉద్యోగుల విధి. ఇందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.కోట్ల నిధులు విడుదల చేస్తుంటాయి. కానీ, కంచే చేను మేసిన చందంగా అభివృద్ధి నిధులతోపాటు అడవులను సైతం రక్షించాల్సిన ఉద్యోగులే మేసేస్తున్నారు. మేత మేసిన తరువాత మేల్కొంటున్న ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలు అటవీశాఖలో మార్పు తేలేకపోతున్నాయి.

అటవీభూములపై కొరవడిన స్పష్టత

అటవీ సంపదను రక్షించడానికి అటవీశాఖలో క్షేత్ర స్థాయిలో బీట్ అధికారి, ఆపైన సెక్షన్ అధికారి, డిప్యూటీ రేంజ్ అధికారి, రేంజ్ అధికారి ఉంటారు. డివిజన్ స్థాయిలో ఎఫ్‌డీఓ, జిల్లా స్థాయిలో డీఎఫ్ఓ ఉంటారు. సాధారణంగా ఏ ఉద్యోగికైనా తాను పని చేసే ప్రాంత పరిధిని పక్కాగా నిర్దేశిస్తారు. కానీ, అటవీశాఖలో మాత్రం ఈ విషయంలో స్పష్టత కనిపించదు. ఏదైనా సమస్య ఉద్భవించినప్పుడు మ్యాప్‌లు వెతుక్కోవడం, సర్వేలు చేయడం శరామామూలే. రోజులు గడిచినా స్పష్టత మాత్రం కనిపించదు. దీనికి కారణం రెవెన్యూ, అటవీ భూభాగాల గుర్తింపునకు రెండు శాఖల మధ్య జాయింట్ సర్వే నేటికీ జరగకపోవడమే.

విస్తీర్ణం కుచించుకుపోయినా..

అడవులలో పోడు నరికి సాగు భూములుగా మార్చుకున్న రైతులకు ప్రభుత్వాలు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేశాయి. ఈ ప్రక్రియ ప్రారంభంలో అటవీశాఖ అధికారుల సహకారంతో అడవులు గుల్ల అయినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. పోడు నరకడం రాజకీయ పక్షాలకు ఓటర్లను సృష్టించే యంత్రంగా మారడంతో అడవులపై వారి జోక్యం క్రమంగా పెరుగుతూ వచ్చింది. దీన్ని అవకాశంగా తీసుకున్న అటవీశాఖ ఉద్యోగులు కంచెను తొలగించి జనంతోపాటు తాము కూడా అడవులను మేయడం ప్రారంభించారన్న ఆరోపణలకు గతంలో ఉద్యోగులపై అధికారులు తీసుకున్న చర్యలే ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఫలితంగా సహజ సిద్ధమైన అడవులకు కేంద్రంగా దశాబ్దాలపాటు విలసిల్లిన ఇల్లెందు ఏజెన్సీలో విస్తీర్ణం క్రమంగా కుచించుకుపోయింది. నేటికీ అంతరించిపోతూనే ఉంది.

చేతులు కాలాక..

అంతరించిపోతున్న అడవులను పునరుద్ధరించాల్సిన వేళ సంబంధిత అధికారులే ఆ కాస్త సంపదను దారి మళ్లించడం ప్రారంభించారు. పూసపల్లి గ్రామ సమీపంలో అటవీభూభాగం సరిహద్దులు చెరిపేసి పెద్ద మొత్తంలో భూములను ధారాదత్తం చేశాక మేల్కొన్న అధికారులు ఏకంగా డివిజన్ అధికారి కర్నావత్ వెంకన్నను సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది కిందట గుండాల మండలం కాచనపల్లి రేంజ్ పరిధిలోని నారవేప కలప మాయమైన తరువాత జగ్గుతండా బీట్ అధికారి హనుమంతు, డీఆర్ఓ బేగం, ఏడాదిన్నర కిందట ఇల్లెందు రేంజ్ అధికారి రవికిరణ్, డీఆర్ఓలు సుక్కి, జయరాం అటవీ అభివృద్ధి నిధులను కాజేసిన తరువాత, జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో ధ్రువీకరించి ఇల్లెందు రేంజ్ ధర్మాపురం బీట్ అధికారి చందులాల్‌ను సస్పెండ్ చేశారు. ఇలా ఒకరి తరువాత మరొకరిపై వరుసగా చర్యలు తీసుకుంటున్నా అటవీశాఖ అధికారులు, సిబ్బందిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉన్నతాధికారుల వైఖరి, పర్యవేక్షణ లోపం స్పష్టంగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. రేంజ్ పరిధిలో నలుగురు అధికారుల వ్యవస్థ ఉన్న శాఖలో తప్పు జరుగుతున్న విషయాన్ని ఎవరూ ముందుస్తుగా గుర్తించకపోవడం ఉద్యోగుల చిత్తుశుద్ధిని శంకించేలా చేస్తోంది. క్షేత్ర స్థాయి నుంచి డివిజన్, జిల్లాస్థాయి వరకు బలమైన పర్యవేక్షణ అధికారుల బృందం ఉన్న అటవీశాఖపై ఈ స్థాయిలో అవినీతి ఆరోపణలు వెలుగుచూడటం చర్చనీయాంశంగా మారింది.



అటవీశాఖ ఇల్లెందు డివిజన్ కార్యాలయం

కర్తవ్యం ఏమిటంటే..

అటవీశాఖను సంరక్షించుకునేందుకు ఇప్పటికైనా ఉన్నతాధికారులు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముందస్తుగా ప్రతి బీట్ అధికారి వద్ద తనకు అప్పగించిన పరిధికి సంబంధించిన భౌగోళిక చిత్ర పటం, అందులో అడవుల విస్తీర్ణం, పోడు సాగు, ఆక్రమణలు వంటి వివరాలు స్పష్టంగా ఉండాలి. ఇలా సెక్షన్, రేంజ్, డివిజన్ స్థాయిలో నమూనా చిత్రాలను రూపొందించాలి. ఉన్నతాధికారులు తనిఖీలు, సందర్శనకు వెళ్లిన సమయంలో సంబంధిత బీట్ అధికారి వద్ద చిత్రపటం తీసుకొని స్వయంగా పరిశీలన చేపడితే అక్రమాలను కొంతైనా నిలువరించేందుకు అవకాశం ఉంటుంది.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించండి

జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి



కరకగూడెంలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

కరకగూడెం: అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. మంగళవారం ఆయన కరకగూడెం, సమత్ భట్టుపల్లి పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించి పలు రికార్డులు తనిఖీ చేశారు. మండల కేంద్రంలో డ్రెయిన్లను పరిశీలించి మురుగు నీరు సక్రమంగా పారేలా నిరంతరం చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతీ రోజు ట్రాక్టర్ ద్వారా గ్రామాల్లో చెత్త సేకరించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. అనంతరం కరకగూడెం పంచాయతీ కార్యాలయంలో స్టోర్ రూమ్‌ను, ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్న ఎకో బ్రిక్ తయారీని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మారుతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు



మధిరలో పర్యటిస్తున్న రామచంద్రరావు, నాయకులు

మధిర/ఖమ్మం లీగల్: తెలంగాణలో బీజేపీ ప్రాథమిక సభ్యత్వాలు రికార్డ్ స్థాయిలో నమోదవుతున్నాయని, పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వాలు స్వీకరిస్తున్నారని బీజేపీ తెలంగాణ సభ్యత్వ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తెలిపారు. మధిరతో పాటు ఖమ్మం కోర్టులో న్యాయవాదులకు మంగళవారం సభ్యత్వాలు అందజేశాక ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే గతంలో అతి ఎక్కువ సభ్యులు ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీని అధిగమించి 10 కోట్లకు పైగా సభ్యత్వాలతో బీజేపీ ముందు నిలిచిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన కారణంగానే ఇది సాధ్యమైందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సైతం గతంలో లేని విధంగా సభ్యత్వాలు నమోదవడంపై హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, విజయరాజు, ఏలూరి నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, రామిశెట్టి నాగేశ్వరరావు, మర్సకట్ల స్వర్ణాకర్, శ్రీహరి, మినుగు శంకర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాలను జెన్‌కో ఆధ్వర్యానే నిర్మించాలి..



నిరసన తెలుపుతున్న ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులు

పాల్వంచ: రామగుండంలో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ స్టేషన్‌ను సింగరేణితో జాయింట్ వెంచర్ కాకుండా కేవలం జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కేటీపీఎస్ 7వ దశ మెయిన్ గేటు ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జెన్‌కోలో నిపుణులైన ఇంజనీర్లు, ఉద్యోగులున్నారని, సింగరేణితో జాయింట్ వెంచర్ చేయడం వల్ల భవిష్యత్‌లో జెన్‌కో మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేసారు. భవిష్యత్‌లో నిర్మించే విద్యుత్ కర్మాగారాలన్నింటినీ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగీలాల్, మధుబాబు, బ్రహ్మాజీ, యాకూబ్, మహేశ్, శ్రావణ్ బాబు, శ్రీకాంత్, రాజేశ్, నరేందర్, నవీన్, యాస్మీన్, శ్రీనిధి, అనూష, లక్ష్మి, ఇంజనీర్లు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడించిన ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో మంగళవారం ఐదు కేసుల్లో 319 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఏపీ రాష్ట్రం పుసులంక నుంచి 14 కేజీల గంజాయి తరలిస్తూ హైదరాబాద్‌లోని బాలానగర్ (ఫతేనగర్)కు చెందిన శక్తి రాహుల్, గోపిశెట్టి అక్షిత్ పట్టుబడ్డారని.. ఏపీలోని చింతూరు నుంచి 100 కేజీల గంజాయిని తరలిస్తూ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మున్వర్ అలీ, నేరేళ్ల అపర్ణ, నేరేళ్ల అఖిల్ దొరికారని.. మోతుగూడెం నుంచి 180 కేజీల గంజాయిని తరలిస్తూ హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన దత్తుపంచాల్ పట్టుబడ్డాడని, మరో 25 కేజీల గంజాయిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన గణేశ్, శేఖర్‌చౌదరి, గుంటూరుకు చెందిన బొనిగెల మహేశ్, బాపట్ల జిల్లాకు చెందిన చేగుడి దినేశ్‌ను అబ్కారిశాఖ అధికారులు పట్టుకున్నారని వెల్లడించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, పట్టుబడిన వారి వద్ద నుంచి రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

ఎన్నో కేసులు..

కాగా, మున్వర్ అలీపై గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులున్నాయని డిప్యూటీ కమిషనర్ చెప్పారు. 2007లో మహారాష్ట్రలోని పాట్నాలో ఒక కేసు, 2013లో నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, 2017లో నిజామాబాద్ 4 టౌన్‌లో ఒక కేసు, 2018లో నిజామాబాద్ రూరల్‌లో మరో కేసు, 2017లో వేర్వేరు ప్రాంతాలైన బాచన్నపేట్ (వరంగల్ జిల్లా), పత్తిపాడు (ఈస్ట్ గోదావరి), భవానీపురం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం), విజయవాడలోని ఉంగుటూరులో కేసులున్నాయన్నారు. మున్వర్ అలీతో పాటు పట్టుబడిన నేరేళ్ల అపర్ణ, అఖిల్ కూడా గంజాయి తరలిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని, అపర్ణ భర్త సదయ్య, మున్వర్ అలీ గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడి, పలుమార్లు జైలుకి కూడా వెళ్లి వచ్చారని, అయినప్పటికీ వీరి పద్ధతిలో మార్పు రాలేదని చెప్పారు. ప్రస్తుతం మున్వర్ అలీతో నేరేళ్ల సదయ్య భార్య అపర్ణ, అతని కుమారుడు అఖిల్ కూడా కలిసి గంజాయి తరలిస్తున్నారని జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్పీ జానయ్య, భద్రాచలం ఎక్సైజ్ శాఖ సీఐ రహీమున్నీసాబేగం, రమేశ్, ఎస్ఐలు గౌతమ్, అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ అలీం, కానిస్టేబుళ్లు బాబు, వీరబాబు, రాకేశ్, కిరణ్ కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, భద్రాచలంలో భారీగా గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులను ఆ శాఖ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి అభినందినట్లు జనార్దన్‌రెడ్డి వివరించారు.

అధికారిపై కార్మికుడి దాడి

కేసు నమోదు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో కోరిన చోట విధులకు పంపలేదని సూపర్‌వైజర్‌పై దాడి చేసిన ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం ఓసీ–2 సర్వే డిపార్ట్‌మెంట్‌లో డ్యూటీ డిస్ట్రిబ్యూషన్ సమయంలో సర్వేయర్ మెగిలిశెట్టి ప్రసాద్, గురుప్రసాద్‌లు అధికారుల ఆదేశాల మేరకు మొత్తం 10 మంది కార్మికులకు విధులు కేటాయించారు. ఈ క్రమంలో ఓ కార్మికుడు తాను అనారోగ్యంతో ఉన్నానని, తాను సూచించిన ప్రదేశంలో విధులు కేటాయించాలని కోరాడు. ఇటీవల ఫిట్‌గా ఉన్నానని ఆదివారం ప్లేడే తీసుకున్న కార్మికుడు సోమవారం ఫిట్‌గా లేనని చెప్పి వాగ్వాదానికి దిగిన కార్మికుడి తీరుపై సూపర్‌వైజర్లు గని అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన సదరు కార్మికుడు సర్వే సూపర్‌వైజర్ మెగిలిశెట్టి ప్రసాద్‌పై నాన్‌చాక్‌తో దాడికి పాల్పడి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న సింగరేణి అధికారులు కార్మికుడిని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గని అధికారులతో కలిసి సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై మణుగూరు సీఐ సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా, అధికారుల ఫిర్యాదు మేరకు కార్మికుడిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇడ్లీలో బొగ్గు ముక్కలు



ఇడ్లీలో వచ్చిన బొగ్గు ముక్కలు

మణుగూరుటౌన్: యాజమాన్యం కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఖర్చుకు వెనకాడకుండా లక్షలాది రూపాయలు వెచ్చించి కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహిస్తున్న క్యాంటీన్ ఇడ్లీలో బొగ్గు ముక్కలు కలకలం సృష్టించాయి. నాసిరకం పదార్థాలు కార్మికులకు అందించడం పట్ల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓసీ–2 సైట్ ఆఫీస్ నుంచి ఫీడర్ క్యాంటీన్ ద్వారా కేపీయూజీకి వచ్చే క్యాంటీన్‌లో ఇడ్లీలో కార్మికుడికి బొగ్గు ముక్కలు రావడంపై కాంట్రాక్టర్‌తో క్యాంటీన్ మెయింటెనెన్స్ చేసే వ్యక్తిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. క్యాంటీన్ నిర్వహణ నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారించకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని టీబీజీకేఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కార్మిక శ్రేయస్సు, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు: పాపకొల్లులో ఓ ఇంట్లో నిల్వచేసిన రేషన్‌బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య కథనం ప్రకారం.. మండలంలోని జడలచింత, పాపకొల్లుకు చెందిన రామారావు, నర్సింహారావు, రఘు కలిసి..లబ్ధిదారుల నుంచి సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి, సత్యం ఇంట్లో నిల్వచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. ఆ నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

పినపాక తహసీల్దార్ సస్పెండ్

పినపాక: పినపాక తహసీల్దార్ సూర్యనారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. మంగళవారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో కోర్టు వివాదంలో ఉన్న భూములను, వారసత్వ భూములను అక్రమంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే విచారణ చేపట్టగా తహసీల్దార్ సూర్యనారాయణ తప్పుచేసినట్లు తేలడంతో సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్ అనుమతులు లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవల తహసీల్దార్ సూర్యనారాయణను గుండాల తహసీల్దార్‌గా బదిలీ చేయగా.. దానిని కూడా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

అశ్వారావుపేట: భూవివాదంలో సహకరిస్తున్నాడని దాడికి పాల్పడిన వ్యక్తిపై అశ్వారావుపేట ఎస్ఐ యయాతి రాజు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ కథనం ప్రకారం.. పేరాయిగూడెం గ్రామానికి చెందిన గుర్రాల సాయి కుటుంబీకులకు మరో వ్యక్తికి భూ వివాదం నడుస్తోంది. కాగా, కాంగ్రెస్ నాయకులు జేష్ట సత్యనారాయణచౌదరి తన కారులో సాయి ప్రత్యర్థిని తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో తన ప్రత్యర్థికి సహకరిస్తున్నాడని భావించిన సాయి.. సత్యనారాయణచౌదరి కారును రింగ్‌సెంటర్‌లో ఆపి.. దుర్భాషలాడి.. దాడికి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో సాయిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో రెండు రోజుల కిందట రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సమయంలో లంబాడికాలనీకి చెందిన కృష్ణ గాయపడ్డాడు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమాదానికి కారణమైన అనే వ్యక్తిపై ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.

బాలికపై లైంగికదాడి

కరకగూడెం: బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన మండలంలో కలకలం రేపింది. ఏడూళ్ల బయ్యారం ఇన్‌చార్జ్ ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన బిజ్జా సాంబయ్య మంగళవారం అదే గ్రామానికి చెందిన బాలికను ఇంట్లోకి లాక్కెళ్లి.. నోట్లో గుడ్డలు కుక్కి, లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ వివరించారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

చర్ల: మండలంలోని చీమలపాడుకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం సాయంత్రం చింతచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, కొమ్మలు పొట్టలో గుచ్చుకోవడంతో పేగులు బయటకు వచ్చాయి. క్షతగాత్రుడిని గ్రామస్తులు చర్ల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

గుండెపోటుతో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల మృతి



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

తల్లాడ: మండలంలోని ముద్దునూరు మాజీ సర్పంచ్ యరమల వెంకటేశ్వరరెడ్డి (57) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండు రోజుల కిందట అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతుండగానే ఆయనకు గుండెపోటు రాగా మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన రంగాపురం తీసుకురాగా పలువురు నివాళులర్పించారు.

ఆర్లగూడెం మాజీ సర్పంచ్..

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం మాజీ సర్పంచ్ కొర్సా రమేశ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా తదితరులు నివాళులర్పించి రమేశ్ సేవలను కొనియాడారు. వివిధ పార్టీల నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, కణితి రాముడు, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎలిమి ఎల్లారెడ్డి, మండపాటి సుధాకర్‌రెడ్డి, తెల్లం సీతమ్మ, లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ పాల్గొన్నారు.

విద్యుత్ వైరు తెగిపడి రెండు ఎద్దులు మృతి

చర్ల: మండలంలోని పూసుగుప్పలో విద్యుత్ వైరు తెగిపడి రెండు దుక్కిటెద్దులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కొత్తపూసుగుప్పకు చెందిన గెండిగుండి పాపారావు పొలం దున్నేందుకు కొత్త పూసుగుప్ప నుంచి పాత పూసుగుప్పకు ఎదులను తోలుకొని వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌లోని ఓ వైరు తెగి కింద పడింది. దానిని తొక్కిన రెండు ఎద్దులు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. కళ్ల ముందే ఎద్దులు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. పొలం దున్నేందుకు ట్రాక్టర్ కిరాయి చెల్లించే స్థోమత లేక బంధువుల వద్ద రూ.90 వేలు అప్పు చేసి ఇటీవలే రెండు దుక్కిటెద్దులను కొన్నానని, ఇప్పుడు అవి మృత్యువాత పడ్డాయని వాపోయాడు. స్థానికులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించడంతో చర్ల సెక్షన్ ట్రాన్స్‌కో ఏఈ యోహాను ఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు. పశు వైద్యాధికారి మృతి చెందిన ఎద్దులకు పంచనామా నిర్వహించారు.

సిట్.. బాబు స్కిట్

లడ్డూ వివాదంపై సిట్ ఇన్‌చార్జ్‌గా అత్యంత వివాదాస్పద ఐపీఎస్ అధికారి త్రిపాఠి

చంద్రబాబు అనుకూల వాదనకు బలం చేకూర్చడమే లక్ష్యంగా ఏర్పాటు

సాక్షి, అమరావతి : అనుకున్నంతా అయ్యింది.. తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరో కుట్రకు తెరతీశారు. లడ్డూ ప్రసాదం వివాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పేరిట తిమ్మిని బమ్మిని చేసే కుతంత్రానికి తెరతీశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ.. తాము చెప్పినట్టుగా దర్యాప్తును ప్రభావితం చేయాలన్న లక్ష్యంతోనే సిట్‌ను నియమించారు. తానే కర్త, కర్మ, క్రియగా మారి తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు.. ఆ కుట్రను కప్పిపుచ్చడమే లక్ష్యంగా ఈ సిట్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎందుకంటే అవాస్తవ ఆరోపణలతో తిరుమల పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బ తీసిందన్నది బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన ఏ ఆరోపణకు కూడా ఆధారం చూపించలేకపోయారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదన్నది స్పష్టమైంది. ఇక కర్ణాటక సహకార పాడి రైతుల సమాఖ్య డెయిరీ (నందిని నెయ్యి)కి ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదని నిలదీసేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే తొలిసారిగా నందిని డెయిరీకి కాంట్రాక్టు ఇవ్వకుండా మహారాష్ట్రలోని ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టిందన్నది వెల్లడైంది. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి విపరీతమైన దుర్వాసన వస్తుందని ఆహార శాస్త్రవేత్తలు సైతం స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో తిరుమల లడ్డూ ప్రసాదంపై అటువంటి ఫిర్యాదులు రాని విషయాన్ని గుర్తు చేశారు. అన్నింటికంటే ప్రధానంగా.. నెయ్యి కల్తీ జరిగినట్టు నివేదిక వస్తే టీడీపీ ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం కింద కేసు ఎందుకు నమోదు చేయాలేదని నిపుణుల ప్రశ్నకు చంద్రబాబు ప్రభుత్వం



కూటమి సేవలో ఘనాపాఠి

ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన త్రిపాఠి తీరుపై 'కూటమి సేవలో ఘనాపాఠి' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనం

ఖంగుతింది. దాంతో రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూ ప్రసాదానికి కళంకం ఆపాదించే కుట్ర పన్నారని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. లడ్డూ ప్రసాదం అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించాలని దేశ వ్యాప్తంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. మరోవైపు టీడీపీ దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. లడ్డూ ప్రసాదం అంశంపై హైకోర్టుగానీ సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితోగానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, తిరుమల వ్యవహారాలపై సాధికారికత ఉన్న సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు వ్యాఖ్యలపై విచారించాలని కోరారు. దేశ వ్యాప్తంగా హిందూ సంస్థలు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు కూడా ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. దాంతో చంద్రబాబు బెంబేలెత్తారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారానో మరో దర్యాప్తు సంస్థ ద్వారానో విచారణ నిర్వహిస్తే తమ కుట్ర బట్టబయలవుతుందని ఆందోళన చెందారు. ఎందుకంటే చంద్రబాబు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిట్టింగ్ న్యాయమూర్తిగానీ ఇతర దర్యాప్తు సంస్థకు గానీ సమర్పించాలి. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఎటువంటి ఆధారాలు చూపించ లేరు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండేట్టుగా.. తాను చెప్పింది చేసేలా సిట్ ఏర్పాటు చేశారు.

సిట్ ఇన్‌చార్జ్‌గా వివాదాస్పద అధికారి

అత్యంత వివాదాస్పద అధికారి, ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలకు కొమ్ము కాశారని ఆరోపణలు ఎదుర్కొన్న గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ బృందంలో విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజులను సభ్యులుగా నియమించారు. కాగా, ఎన్నికల్లో అక్రమాలకు చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి పక్కా పన్నాగంతో వ్యవహరించి రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారులపై దుష్ప్రచారం చేశారు. ఎవరెవర్ని బదిలీ చేయాలి.. ఆ స్థానాల్లో ఎవర్ని నియమించాలనే జాబితాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం గమనార్హం. టీడీపీ కూటమి ఒత్తిడికి లొంగి ఎన్నికల కమిషన్ అప్పటి గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న పాలరాజును హఠాత్తుగా బదిలీ చేసింది. ఆ స్థానంలో చంద్రబాబు ఆదేశాలతో దగ్గుబాటి పురందేశ్వరి సూచించిన జాబితాలోని సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఐజీగా నియమించింది. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ రౌడీమూకలు చెలరేగిపోయి విధ్వంస కాండ సృష్టించడం తెలిసిందే. ప్రధానంగా పల్నాడులో టీడీపీ కూటమి గుండాలు దాడులు, దౌర్జన్యాలతో బెంబేలెత్తించారు. మాచర్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ రౌడీలు దాడులు చేశారు. అప్పటి గురజాల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాసు మహేశ్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గురజాలలో బాంబు దాడులకు పాల్పడ్డారు. పల్నాడు వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు వేయకుండా పచ్చ రౌడీలు దాడులతో విధ్వంసం సృష్టించారు. టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఎంతగా ఫిర్యాదులు చేసినా సరే.. సర్వశ్రేష్ఠ త్రిపాఠి పట్టించుకోలేదు. పోలింగ్ రోజున కనీసం ఫోన్లకు కూడా స్పందించలేదు. అదీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ట్రాక్ రికార్డ్. అంతటి వివాదాస్పద అధికారిని చంద్రబాబు ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై ఏర్పాటు చేసిన సిట్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడం గమనార్హం. అంటే ఇక సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో.. నివేదిక ఎలా ఉండనుందో ఊహించుకోవచ్చని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నిబద్ధులైన అధికారులను కాదని..

సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించేందుకు ఐజీలు వినీత్‌బ్రిజ్‌లాల్, పీహెచ్‌డీ రామకృష్ణ, ఆకే రవి కృష్ణల పేర్లను పరిశీలిస్తున్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. కానీ వినీత్ బ్రిజ్‌లాల్ నిజాయితీపరుడు, ముక్కుసూటి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన తాము చెప్పినట్టుగా తప్పుడు నివేదిక ఇవ్వరని చంద్రబాబు భావించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ అడ్డగోలు వ్యవహార శైలితో విసిగిపోయిన ఆయన డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లాలని కూడా భావిస్తున్నారు. ఇక పీహెచ్‌డీ రామకృష్ణ కూడా తాము చెప్పినట్టుగా నివేదిక ఇస్తారని చంద్రబాబుకు నమ్మకం లేదు. ఆకే రవికృష్ణ పేరు పరిశీలించారు గానీ పూర్తి నమ్మకం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. అందుకే ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠినే సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. లడ్డూ ప్రసాదంపై తాము వ్యాప్తిలోకి తెచ్చిన దుష్ప్రచారానికి అధికారిక ముద్ర వేసేలా.. తిరుమల పవిత్రతకు భంగకరంగా నివేదిక ఇచ్చి సర్వభ్రష్టత్వం పట్టించాలన్న చంద్రబాబు పన్నాగంలో భాగంగానే సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నది స్పష్టమవుతోంది.

హిందువులంతా ఏకం కావాలి

సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను

- నేను పోరాటం చేయాలనుకుంటే ఆపేవారెవరూ లేరు
- హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం
- ప్రకాష్‌రాజ్ తెలుసుకుని మాట్లాడాలి
- సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే
- అల్లాహ్, జీసస్‌పైన మీరు మాట్లాడగలరా?
- ఇంద్రకీలాద్రిపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా ఏకమై.. కలసికట్టుగా మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హిందువులు మౌనం వహిస్తే, ఆ మౌనం భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుందన్నారు. ధర్మాన్ని పరిరక్షించడం గుడికి వెళ్లే ప్రతి హిందూ బాధ్యత కాదా, నా ఒక్కడి బాధ్యతేనా అంటూ ప్రశ్నించారు. 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సనాతన ధర్మానికి సంబంధించి పోరాటం చేయాలనుకుంటే తనను ఆపేవారు ఎవరూ లేరన్నారు. ధర్మం కోసం పోరాటం చేస్తే చనిపోవడానికి సిద్ధమని, కానీ, అక్కడిదాకా తీసుకెళ్లనని చెప్పారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సనాతన ధర్మానికి, పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడడం కూడా తప్పే అన్నట్లు చెబితే ఎలా..? మాట్లాడేవారు ఒకటికి వందసార్లు ఆలోచించి మాట్లాడండి అని చెప్పారు. సెక్యులరిజం అనేది వన్ వే కాదని అది టూ వే అని చెప్పారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. మసీదులో చిన్నపాటి చోరీ జరిగితే ఇలాగే మాట్లాడతారా అని అన్నారు. హిందూ దేవుళ్లపైన మాట్లాడే వారు అల్లాహ్ పైన, మహ్మద్ ప్రవక్తపైన, జీసస్‌పైన మాట్లాడగలరా అంటూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. ఇస్లాంపైన మాట్లాడితే ఆ మతం వారు పెద్దఎత్తును బయటకు వస్తారు అంటూ చెప్పారు. హిందువులను రోడ్లపైకి రమ్మని చెప్పడం లేదన్నారు. కనీసం హిందువులకు కోపం రాకపోతే ఏం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సినిమా ఇండస్ట్రీ వారికి కూడా విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మంపై ఇష్టానుసారం జోకులు వేయడం, మీమ్స్ చేయడం సరికాదన్నారు. ఓ సినిమా ఫంక్షన్‌లో జోకులు వేస్తున్నారని, ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. దేశమంతటికి కలిపి 'సనాతన ధర్మ రక్షణ బోర్డు'తప్పనిసరి అని చెప్పారు. చిన్నప్పటి నుంచి తాను సనాతన ధర్మం పాటించేవాడినన్నారు. తమ ఇష్టదైవం ఆంజనేయస్వామి అని, తాము రామభక్తులమని చెప్పారు. ఈ సందర్భంగా పొన్నవోలు సుధాకరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపైన విమర్శలు చేశారు. అంతకుముందు పవన్ కళ్యాణ్‌కు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం మెట్లను కడిగి, పసుపు రాశారు.

మహిళలను అడ్డుకున్న సిబ్బంది

ఆలయంలో మెట్లను పవన్‌కళ్యాణ్ శుభ్రం చేసే కార్యక్రమానికి అర్ధగంట ముందు, ఆ తర్వాత కూడా మహిళా భక్తులు మెట్ల పూజ చేసుకోకుండా ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. మెట్ల పూజ చేసుకుంటూ వస్తున్న మహిళా భక్తులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని క్యూలైన్‌లోకి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి, మహిళా భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెట్ల పూజ మొక్కు పూర్తి చేసుకోకుండా దర్శనానికి వెళ్లమని చెప్పడం ఎంత వరకు సబబని మహిళలు మండిపడ్డారు.

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త నిబంధనలతో కలవరం!

వడ్లను కూడా రాష్ట్రాలు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. 2022 రబీ సీజన్‌కు సంబంధించిన సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేదు. ఇందులో 60% ధాన్యాన్ని విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లోనే మిల్లింగ్‌కు వచ్చిన ధాన్యాన్ని 75 రోజుల్లోనే తప్పనిసరిగా సీఎంఆర్‌గా అప్పగించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

సీఎంఆర్ పెండింగ్ ఉంటే ధాన్యం ఇవ్వరు

పైరవీలతో ఇష్టానుసారంగా ధాన్యాన్ని కేటాయింపజేసుకునే విధానానికి కూడా ఖరీఫ్ నుంచే ప్రభుత్వం చెక్ పెట్టనుంది. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయించాలని నిర్ణయించింది. ఆ మేరకు కచ్చితమైన లెక్కలను నిర్ధారించింది. ఇచ్చిన ధాన్యాన్ని ఒక్కో షిఫ్టుకు 8 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో పనిచేయడం ద్వారా 75 రోజుల్లో కేటాయించిన మొత్తం ధాన్యాన్ని మిల్లింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అప్పటికే రెండు మూడు సీజన్ల సీఎంఆర్ పెండింగ్ ఉన్నా.. మిల్లర్ల సంఘం నాయకులతో పైరవీలు చేయించుకొని తిరిగి ధాన్యం కేటాయింప జేసుకునే విధానానికి కూడా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. మిల్లుల పనితీరును పర్యవేక్షించే బాధ్యత ఇప్పటివరకు అదనపు కలెక్టర్లకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఉండగా, ఇక నుంచి జిల్లా కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించనున్నారు.

బ్యాంకు గ్యారంటీలు, ష్యూరిటీలు తప్పనిసరి

2021– 2022 రబీ సీజన్‌లో మిల్లులకు కేటాయించిన ధాన్యం మిల్లింగ్ కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత చూస్తే ఆ సీజన్‌కు సంబంధించిన ధాన్యం గానీ, డబ్బులు కానీ లెక్క తేల్లేదు. మిల్లులను తనిఖీలు చేస్తే అక్కడ ధాన్యం లేదు. చాలావరకు ధాన్యం పక్కదారి పట్టింది. రాష్ట్రంలోని 3 వేల మిల్లులకు కేటాయించిన 65 ఎల్‌ఎంటీ ధాన్యంలో సుమారు 30 ఎల్‌ఎంటీ ధాన్యం వివరాలు లేవు. ప్రస్తుతం ఆ ధాన్యాన్ని రికవరీ చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఇకపై ధాన్యం కేటాయించిన మిల్లుల నుంచి ఆ ధాన్యం విలువలో 25 శాతాన్ని బ్యాంకు గ్యారంటీ రూపంలో తీసుకోవడమే కాకుండా, ఇద్దరు ఆర్థికంగా ఉన్న వ్యక్తుల ష్యూరిటీ, మిల్లర్ల అసోసియేషన్ నుంచి అఫిడవిట్ రూపంలో హామీ పత్రం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని మిల్లర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

జిల్లా వార్తలు


రాష్ట్రస్థాయి టోర్నీలో ఖమ్మం క్రీడాకారుల హవా



పతకాలు సాధించిన అథ్లెట్లతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మంస్పోర్ట్స్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ అథ్లెట్లు, క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–20 బాలుర విభాగం 400, 800 మీటర్ల పరుగులో అథ్లెట్లు ద్వితీయస్థానంలో నిలిచారు. అలాగే, వివిధ విభాగాల్లో ఎస్‌కే అఫ్తాబ్, వివేక్ చంద్ర, ఎండీ ముబీన్, కె.అశోక్, ఎస్‌కే మస్తాన్, బి.బిందు, బి.వైశాలి, ఎ.మనుశ్రీ, కృష్ణవేణి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్ అహ్మద్ అభినందించారు.

రెగ్యులేటర్ షట్టర్లకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో దేవినేని వెంకటరమణ కెనాల్ నీరు చేరేలా ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ షట్టర్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, ఏఈ తాళ్లూరి నరేశ్ పర్యవేక్షణలో మంగళవారం మరమ్మతులు మొదలయ్యాయి. రెగ్యులేటర్ ద్వారా చెరువు నీరు వృథాగా పోతుండటంతో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం బాధ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే చెరువు నిండు కుండలా ఉండటంతో నీటిని కాపాడేలా మరమ్మతులు చేపడుతుండగా చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు నీరు సరఫరా చేసే ఎడమ కాల్వకు ఇటీవల భారీ వర్షాలు, వరదలతో పలుచోట్ల గండ్లు పడిన విషయం తెలిసిందే. ఈమేరకు గండ్లను అధికారులు యుద్ధప్రాతిపదికను పూడ్చివేసి ఈనెల 21న నీరు విడుదల చేశారు. అయితే, మత్స్య పరిశోధనా కేంద్రం సమీపాన భారీ గండిని పూడ్చివేసినా నీరు లీకేజీ అయింది. దీంతో మళ్లీ అధికారులు నీటి విడుదల నిలిపేసి గతంలో ఉన్న యూటీని పూర్తిగా తొలగించి కాల్వ కట్టను బండింగ్ చేశారు. ఈ పనులు మంగళవారం పూర్తి కావడంతో కాల్వ ద్వారా నీరు విడుదల చేశారు. తొలుత 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు క్రమంగా సాయంత్రానికి 1,700 క్యూసెక్కులకు పెంచారు. కాగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పరిశీలించి మరమ్మతులు, నీటి విడుదల వివరాలను సీఈ విద్యాసాగర్ ద్వారా తెలుసుకున్నారు. గండి పడిన ప్రాంతంలో యూటీని పూర్తిగా తొలగించినందున భవిష్యత్‌లో భారీ వర్షాలు, వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.



కాల్వలో ముందుకు వెళ్తున్న సాగర్ జలాలు

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

భద్రాచలంఅర్బన్: ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలకు తిరిగి తెలంగాణలో కలపాల్సిందేనని సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని తెలిపారు. పేద ప్రజలకు కనీస సౌకర్యాలు దక్కడం లేదని చెప్పారు. ఈమేరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడమే కాక పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. సీపీఎం నాయకులు గడ్డం స్వామి, వై.వెంకట రామారావు, కుంజ మంగమ్మ, నాదెళ్ల లీలావతి, పి.సంతోష్‌కుమార్, ఎం.వీ.ప్రసాద్‌రావు, డి.సీతాలక్ష్మి, ఎంవీఎస్.నారాయణ, ముండ్రు ఝాన్సీ, కనకశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు రావొద్దు



సీఈతో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం ఏర్పడకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని టీజీజెన్‌కో(థర్మల్) డైరెక్టర్ బి.లక్ష్మయ్య సూచించారు. పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు 9, 10, 11వ యూనిట్లలో ఉత్పత్తి తీరును పరిశీలించాక ఇటీవల నిర్వహించిన ఓవరాల్ పనుల తర్వాత ఉత్పత్తి వివరాలను సీఈ ఎం.ప్రభాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోల్ ప్లాంట్, స్టోర్‌ను కూడా పరిశీలించిన డైరెక్టర్ అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు ఎస్‌ఈలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారకుడైన యువకుడిపై కేసు

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందగా, ప్రమాదానికి కారకుడైన యువకుడిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మద్దివంచకు చెందిన కట్టబోయిన వెంకటరత్నం(45) తన భార్య పద్మతో కలిసి బైక్‌పై ఈనెల 8న సాతానిగూడెంలో తమ బంధువు మృతి చెందగా చూసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమాన కామేపల్లి మండలం పండితాపురం సంత సమీపాన ఒడ్డుగూడెంకు చెందిన అభినవ్ బైక్‌పై వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి పరిస్థితి మృతి చెందాడు. ఈమేరకు ఆయన భార్య పద్మ ఫిర్యాదుతో అభినవ్‌పై కేసు నమోదు చేసినట్లు కామేపల్లి పోలీసులు తెలిపారు.

డీఈడీ మెరిట్ జాబితా విడుదల

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని డీఈడీ కళాశాలలో పదో బ్యాచ్ ప్రవేశాలకు సంబంధించి మెరిట్ జాబితాను ఐటీడీఏ పీఓ బి.రాహుల్ విడుదల చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన డీడీ మణెమ్మతో కలిసి జాబితా విడుదల చేశాక మాట్లాడారు. కళాశాలలో 50 సీట్లకు గాను 48 సీట్లు మెరిట్ ద్వారా, రెండు సీట్లు స్పెషల్ కేటగిరీగా కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు అభ్యర్థులు ఈనెల 27న కళాశాల ప్రాంగణంలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీకే.భవాని పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వైరారూరల్: వైరా మండలం పుణ్యపురంలో వరి, పత్తి, మిరప పంటలను కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా పంటలను ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలపై రైతులకు అవగహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు సునీత, ఫణిశ్రీ, ఎం.ముఖేష్, వ్యవసాయాధికారులు టి.కరుణశ్రీ, మంజుఖాన్ పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

గిరిజన యువతికి బాసటగా..

కృత్రిమ కాలు ఏర్పాటు చేయించిన ఎస్‌ఐ



గత ఏడాది మానసతో ఎస్‌ఐ రామారావు, తదితరులు (ఫైల్)

ములకలపల్లి: అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న గిరిజన యువతి కాలికి ఆపరేషన్ చేసిన వైద్యులు విధిలేని పరిస్థితుల్లో కాలు తొడ వరకూ తొలగించారు. దీంతో ఆమె పడుతున్న అవస్థను తెలుసుకున్న ములకలపల్లి వాసి, ఖమ్మం ఎస్‌ఐ పుష్పాల రామారావు స్వచ్ఛంద సంస్థలు, దాతల చేయూతతో ఆమెకు కృత్రిమ కాలు ఏర్పాటు చేయించారు. ములకలపల్లి మండలం గుండాలపాడుకు చెందిన కారం మానస ఎనిమిదో తరగతి చదువుతుండగా కాలికి అంతుచిక్కని వ్యాధి సోకింది. కాలు మడమ భాగం సెప్టిక్ కావడంతో 2022లో తొడ భాగం వరకూ తొలగించారు. ఈ క్రమంలో మానసకు ఇంజనీరింగ్ సీటు వచ్చినా అనారోగ్యానికి తోడు ఆర్థిక సమస్యలతో చదువు మానేసి ఇంటి వద్దే ఉంటోంది. గత ఏడాది చలికాలంలో ఎస్‌ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యాన పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్స్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు గుండాలపాడులో చిన్నారులకు రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. అప్పుడే ఎస్‌ఐకి మానస సమస్య తెలిసింది. దీంతో పినపాకకు చెందిన తొలెం శ్రీనివాస్, విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, హైదరాబాద్‌లోని ఎవల్యూషన్ ప్రోస్తెటిక్ లింబ్ ప్రతినిధి జున్ను నాగరాజు సహకరించగా రూ.లక్షకు పైగా విలువైన మోకాలి వద్ద మడిచేందుకు వీలున్న ప్రోస్తెటిక్ లింబ్ (కృత్రిమ కాలు)ను విదేశాల నుంచి తెప్పించారు. ఈ కాలును సోమవారం హైదరాబాద్‌లో మానసకు ఏర్పాటు చేయగా ఆమె చదువుకునేందుకు వీలు కుదిరినట్లయింది. ఈ సందర్భంగా యువతితో పాటు ఆమె కుటుంబీకులు ఎస్‌ఐ రామారావు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రస్తుతం కృత్రిమ కాలు అమర్చాక..

నిరంతర శ్రమతోనే విజయం

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

మధిర: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని నిరంతరం శ్రమిస్తే తప్పక విజయం దరి చేరుతుందని హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మధిర మండలం మడుపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తోట నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను పాటిస్తూ క్రమశిక్షణతో చదివి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. కాగా, తన క్లాస్‌మేట్ బి.జ్ఞానేశ్వరాచారిని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును సన్మానించారు. ఉపాధ్యాయులు బి.జ్ఞానేశ్వరాచారి, బూసా కోటేశ్వరరావు, కె.ఆదాము, కిశోర్, టి.జ్యోతిర్మయి, బీవీఎస్‌ఎం శర్మ, ఎ.కృష్ణమూర్తి, జి.రామచంద్రరావు, ఎస్.సంధ్యాలక్ష్మి, ఎస్.శ్రీదేవి, ఎం.సాములు, ఎం.మాధవరావు, సీహెచ్ చిట్టిబాబు, సూర్యప్రకాష్‌రావు, టి.సీత విద్యార్థులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జాలిముడి కాల్వకు గండి

మధిర: మండలంలో వైరా నదిపై నిర్మించిన జాలిముడి ప్రాజెక్టు ఎడమ కాల్వ సైడ్ వాల్ సోమవారం రాత్రి తెగిపోయింది. ఇటీవల వచ్చిన భారీ వర్షాలతో కాల్వ సైడ్ వాల్ కొంతమేర ధ్వంసమైంది. కాగా, ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు నీటి ఉధృతి పెరగడంతో ఇప్పుడు సైడ్ వాల్ తెగిపోయిందని రైతులు తెలిపారు. ఈ కాల్వ ద్వారా జాలిముడి, రొంపిమల్ల, మల్లవరం, సిరిపురం, వంగవీడు తదితర గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఈ మేరకు అధికారులు స్పందించి సైడ్ వాల్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



సైడ్‌వాల్ ధ్వంసం కావడంతో వృథాగా పోతున్న నీరు